

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 199 శుక్రవారం 31 అక్టోబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## వరంగల్ వరద ప్రాంతాల్లో
# సీఎం ఏరియల్ సర్వే

అధికారుల్లో సమన్వయ లోపం

వరంగల్ వరదల్లో స్పష్టంగా కనిపించింది

ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

మొంథా తుఫాన్‌తో 12జిల్లాల్లో ప్రభావం

పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు

మృథి చెందిన వారికి 5లక్షల రిహారం

ఎకరా పంట నష్టానికి 50వేలు చెల్లింపు

ఇసుకమేటలు తొలగించేందుకు ప్రణాళికలు

కలెక్టరేట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష



**హనుమకొండ,అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** 'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులుకునే ప్రసక్తే లేదన్నారు. **మిగతాది** 2లో...



## దేశ ఐక్యత, సమగ్రతను
# కాపాడతా





ఐక్యతా ప్రతిజ్ఞ చేసిన ప్రధాని మోదీ

సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్‌కు ప్రధాని మోదీ నివాళి

**అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ**మిగతాది** 2లో...

## అమెరికా-భారత్ మధ్య
# రక్షణ ఒప్పందం

ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం

పదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం

రాజ్‌నాథ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్న అమెరికా రక్షణ మంత్రి



**అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. **మిగతాది** 2లో...

## హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదలను
# రోడ్డుపాలు చేస్తున్నారు

జూబ్లీహిల్స్‌లో కేటీఆర్ రోడ్డు షో... కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

హిట్లర్ నశించడం చూశామని, కాంగ్రెస్ ఎప్పటి వరకు ఉంటుందో చూస్తామని వ్యాఖ్య

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దెబ్బపడితే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదన్న కేటీఆర్

**హైదరాబాద్,అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ అభ్యర్థి మాగంటి సునీత తరఫున ఈరోజు రోడ్డు షో నిర్వహించారు. మరో పది రోజుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఓటింగ్ జరగనున్నందున, ఆయా పార్టీల ప్రచారం ఊపందుకుంది. **మిగతాది** 2లో...



## క్యాబినేట్ హోదాతో సలహాదారులుగా
### సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావులు

ఇద్దరికీ క్యాబినేట్ హోదాతో నియామకాలు

కేబినేట్ కు హాజరయ్యేలా సుదర్శన్‌కు వెసలుబాటు



**హైదరాబాద్,అక్టోబర్ 31 (జర్నలిస్టు జర్నీ న్యూస్)** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ **మిగతాది** 2లో...

## భౌతికంగా హాజరుకావాల్సిందే

వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

నవంబర్ 3న భౌతికంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు

వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తి తిరస్కరణ



2లో.



# మంత్రిగా అజారుద్దీన్

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్

సిఎం రేవంత్ , మంత్రులు తదితరుల హాజరు

**హైదరాబాద్,అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. **మిగతాది** 2లో...



## బాధితురాలినే పెళ్లాడిన
# దోషికి శిక్ష రద్దు!

పోక్సో కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు...

దోషికి పడిన పదేళ్ల శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద అసాధారణ అధికారాలను వినియోగించిన ధర్మాసనం

నిందితుడు బాధితురాలినే వివాహం చేసుకుని, బిడ్డకు తండ్రయిన వైనం



2లో.

## ఆ సంప్రదాయాన్ని
# బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

: జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి ప్రచారం

చనిపోతే పోటీలో నిలబెట్టవద్దనే

పీజేఆర్ చనిపోతే బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టిందని ఆగ్రహం



**హైదరాబాద్,అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో పోటీ పెట్టకూడదనే సంప్రదాయాన్ని బీఆర్ఎస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆరోపించారు. **మిగతాది** 2లో...

# దేశ ఐక్యత, సమగ్రతను కాపాడతా

(మొదటి పేజీ తరువాయి)
గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నర్మదా నది ఒడ్డున ఉన్న 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద సర్దార్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు దేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాయి.ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఏక్తా శపథ్' (ఐక్యతా ప్రతిజ్ఞ) చేశారు. "దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటానికి నా జీవితాన్ని అంకితం చేస్తానని ఈ రోజు ప్రతిజ్ఞ చేస్తున్నాను. జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఈ ప్రమాణం స్వీకరిస్తున్నాను. దేశ అంతర్గత భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉంటాను" అని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు ఈరోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రధాని మోదీ పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్'ను వీక్షించారు. ఈ పరేడ్‌లో బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ సహా వివిధ రాష్ట్రాల పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పటేల్‌కు నివాళులర్పించారు. "సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత్ ఆయనకు నివాళులర్పిస్తోంది. దేశాన్ని ఏకీకరణ చేయడంలో ఆయన కీలక శక్తిగా నిలిచారు. జాతీయ సమగ్రత, సుపరిపాలన, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు.అనంతరం విడుదల చేసిన వీడియో సందేశంలో భారతదేశ ఏకీకరణ శిల్పిగా పటేల్‌ను అభివర్ణించారు. "భావజాల విభేదాలు ఉన్నవారితో కూడా కలిసి పనిచేసి, ప్రజలను ఏకం చేయడంలో సర్దార్ పటేల్‌కు సాటిలేని సామర్థ్యం ఉంది. ఆయన ప్రతి చిన్న విషయాన్ని గమనించి, దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి, సంస్థానాలను దేశంలో విలీనం చేసి, భిన్నత్వంలో ఏకత్వం అనే మంత్రాన్ని భారతీయులలో మేల్కొల్పారు" అని ప్రధాని వివరించారు.భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రతను పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)
ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

# వరంగల్ వరద ప్రాంతాల్లో సిఎం ఏరియల్ సర్వే

(మొదటి పేజీ తరువాయి)
ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్ సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టం అంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు.నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని వార్నింగ్ ఇచ్చారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పనులు చేయాలని సూచించారు. ఇండ్లు కోల్పోయిన వాళ్ల లిస్ట్ సిద్ధం చేసి ఇండ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ముంపు తీవ్రత పెరిగిందని చెప్పుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకోవాలని, వరద ప్రభావంపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విజిట్ చేయాలని హుకుం జారీ చేశారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు కూడా తెచ్చుకుందామని తెలిపారు. గతంలో కేంద్ర నిధులు వాడుకోలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఇండ్లు, పంటలు, పశువుల నష్టంపై పూర్తి నివేదిక కావాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని ఆజ్ఞాపించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సిఎం వెంట మంత్రి పొంగులేటి, మేయర్ గుండుసుధారాణి తదితరులు ఉన్నారు.

----

# తెలంగాణలో సోలార్ విద్యుత్‌కు నైవేలీ పెట్టుబడులు

## కెసిఆర్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని కిషన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** నైవేలీ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ తెలంగాణలో రూ.10,000 కోట్ల పెట్టుబడులతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించి, ఈ పెట్టుబడులకు సహకరించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ సంవత్సరానికి సగటున 9.8 శాతం పెరుగుతోంది. 2030 నాటికి రాష్ట్రానికి 33,773 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని చెప్పారు. అయితే, రాష్ట్రంలోని డిస్కంలు (విద్యుత్ పంపిణీ సంస్థలు), పవర్ ప్రొడక్షన్ యూనిట్లు తీవ్ర నష్టాల్లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో కొనసాగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.30,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి రూ.42,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలంటే ప్రభుత్వం వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆమన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల



ఉత్పత్తిలో 74 శాతం థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి అవుతోందని చెప్పారు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రాల వద్ద 22 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లోనే సోలార్ పంప్ సెట్లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, గృహ అవసరాల కోసం లక్షలాది కుటుంబాలు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్ కు అనుసంధానం చేసుకుని, విక్రయించుకునే వీలు కలుగుతుందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కనీస మద్దతు ధరను భారీగా పెంచామని, యూరియా వంటి ఎరువుల ధరలు పెరిగినా కూడా సబ్సిడీ ధరకే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 450 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లకు అనుమతి ఇచ్చామని, అలాగే 40 వేల సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లు కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారని.. ఇందులో 20,000 యూనిట్లు మొదటి విడతలో ఇన్‌స్టాల్ చేస్తామని వివరించారు. రామగుండం ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను దశలవారీగా నిర్మిస్తు న్నామని తెలిపారు. మొదటి విడతలో రూ.12,000 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో ప్రారంభించారని, రెండో విడతలో 3800 మెగావాట్ల ప్రాజెక్టు పనులు కొనసాగు తున్నాయని చెప్పారు. ఇందులో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 80 శాతం తెలంగాణకే కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మొత్తం విద్యుత్ కొనుగోలు చేయకుండా మూడో వంతు మాత్రమే తీసుకుంటోందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీపీసీ ఉత్పత్తి చేసిన మొత్తం విద్యుత్‌ను కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు పూర్తయ్యాయని, మరో 56 మెగావాట్ల సోలార్ ఎ÷-లాంట్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. రామగుండంలో 121 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్లుగా మైనారిటీలకు అన్యాయం చేసి, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల దృష్ట్యా ఓట్ల కోసం ఆ వర్గానికి చెందిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తున్నారని అన్నారు.

# క్యాబినేట్ హోదాతో సలహాదారులు

(మొదటి పేజీ తరువాయి)
ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీ కృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కొరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# అమెరికా-భారత్ మధ్య రక్షణ ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని మరింతగా పెంచుకుంటామని, తమ రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# భౌతికంగా హాజరుకావాల్సిందే

## వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

**అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది.ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళ్లు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే.ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశువైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఏబీసీ నిబంధనలు దేశమంతటా ఒకేలా వర్తిస్తాయని పేర్కొంటూ రాష్ట్రాలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వల్ల చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన మీడియా కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు జూలై 28న ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది.

# ఆ సంప్రదాయాన్ని బీఆర్‌ఎస్ తుంగలో తొక్కింది

(మొదటి పేజీ తరువాయి)
ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. గతంలో పీజేఆర్ మరణించినప్పుడు బీఆర్‌ఎస్ దుర్మార్గంగా వారి అభ్యర్థిని నిలబెట్టిందని మండిపడ్డారు. నగరానికి గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత పీజేఆర్‌దేనని కొనియాడారు. అలాంటి పీజేఆర్‌పై పోటీకి దింపిన బీఆర్‌ఎస్‌కు సానుభూతి ఓట్లు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కూడా సెంటిమెంట్‌ను నమ్ముకున్నారని ఆరోపించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా ఈ ప్రాంతానికి వచ్చారా అని నిలదీశారు. ఓట్ల కోసం బీఆర్‌ఎస్ నాయకులు వస్తే వారికి వాతలు పెట్టాలని ఓటర్లకు సూచించారు. నవీన్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని హామీ ఇచ్చారు.

# హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదలను రోడ్డుపాలు చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)
ఈ క్రమంలో కేటీఆర్ షేక్‌పేట డివిజన్‌లో ప్రచారం చేశారు. ఓయూ కాలనీ మీదుగా వినోభానగర్ వరకు రోడ్డు షో కొనసాగింది.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, హిట్లర్ నశించడాన్ని చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నాళ్లు ఉంటుందో చూస్తామని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, ఒకవేళ ఓటమి ఎదురైతే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు నిలబడదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లు కూల్చడమా అని ప్రశ్నించారు. ఒకప్పుడు ఇందిరమ్మ పేదరికాన్ని నిర్మూలించాలని నినదిస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు.

మాగంటి సునీత మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఒక కుటుంబమని గోపీనాథ్ చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మహిళలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరించేవారని అన్నారు. కష్ట సమయాల్లో ప్రజలకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఎవరికీ భయపడవద్దని, ప్రజలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు

# ఇందిర, పటేల్లకు సిఎం రేవంత్ నివాళి

హన్మకొండ,**అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు ఘనంగా నివాళి అర్పించారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లో ఆ మహనీయుల చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి.

-రైతులు పంట సాగు వివరాలు నమోదు చేసుకోవాలి.

-జిల్లా వ్యవసాయ అధికారి. విజయనిర్మల.



**బయ్యారం/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో వరి సాగు పంట పొలాలను క్షేత్రస్థాయిలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తమ సాగు భూములలో ఏ ఏ పంటలను సాగు చేశారో ఆ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వారి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్ ద్వారా అధికారుల వద్ద రైతుల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.పంట నమోదు వలన రైతుకు ఏ ఇబ్బంది కలగకుండా పంటను విక్రయించేందుకు మార్గం సుగమముగా ఉంటుందని తెలిపారు.తప్పకుండా రైతులు తమ పంట సాగు నమోదు చేసుకోవాలని కోరారు.మండలంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల పంట పొలాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు.మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈఓలు నాగరాజు,అఖిల్ రైతులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్బంగా ఘన నివాళులు.

-కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):** భారత ఉక్కు మహిళ, భారతదేశ మొట్టమొదటి మహిళ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గంధంపల్లి కొత్తపేట పంచాయతీ పరిధిలో ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధి,ఐక్యత, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అర్పించిన మహానేత ఇందిరా గాంధీ అని,వారు చూపిన మార్గం ఇప్పటికీ దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తోందని వారి సేవలను స్మరించుకున్నారు.సమాజంలో సమానత్వం,మహిళా సాధికారతకు మార్గదర్శకురాలిగా భారత ఉక్కు మహిళ,భారతదేశ మొట్టమొదటి మహిళ ప్రధానిగా నిలిచారని,భారత దేశ ప్రజల హక్కుల కోసం చివరి వరకూ పోరాడిన నాయకురాలు ఇందిరమ్మ అని కొనియాడారు..

ఈ కార్యక్రమంలో జూలకంటి సీతారాం రెడ్డి,మాజీ అధ్యక్షులు వడ్లమూడి సురేష్ బాబు,పుల్లూరి బాలరాజు,బాలకృష్ణ,కొల్లిపాక రవి,దానకొండ నాగరాజు,వీరన్న,నెహ్రు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ. బహుమతులు అందజేసిన బెటాలియన్ అధికారులు





**సత్తుపల్లి/అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర మరియు డ్రగ్స్ కు విద్యార్థులు దూరంగా ఉండటం ఎలా? అనే అంశంపై అమర పోలీస్ సంస్మరణ వారోత్సవంలో భాగంగా 15వ పోలీస్ బెటాలియన్ అధికారులు నిర్వహించిన వ్యాసరచన పోటీలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో విశ్వశాంతి విద్యాలయానికి చెందిన లోహిత (8వ తరగతి) ప్రథమ స్థానం, నాగ వర్షిని( 9వ తరగతి) తృతీయ స్థానం, డి ఏవి కళాశాలకు చెందిన చరిష్మా( ఇంటర్ సెకండియర్) ద్వితీయ స్థానం సాధించారు. గురువారం గంగారం బెటాలియంలో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బెటాలియన్ అదనపు దళాధిపతి అంజయ్య , సహాయ దళాధిపతులు శ్రీధర్ రాజా, రంగారెడ్డి బహుమతులు.
అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
సోషల్ మీడియా దుర్వినియోగం అరికట్టడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిల్లా



**రాయపర్తి/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఏకే తండ గ్రామానికి చెందిన హలావత్ రమేష్ అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి మాజి టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి పూల మాల వేసి నివాళు లర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హలవత్ సోమా నాయక్,గ్రామ పార్టీ అధ్యక్షుడు భద్రు నాయక్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

.భూమి పూజకు అధిక సంఖ్యలో హాజరైన భక్తులు





**స్టేషన్ ఘన్ పూర్/అక్టోబర్ 31 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆవరణలో శ్రీ రామలింగేశ్వర స్వామి పురా తన దేవాలయం పునర్నిర్మించడం కోసం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధి అసోసియేషన్ తాటి కొండ ఆధ్వర్యంలో నారాబోయిన శ్రీనివాస్ కళ్యాణ్ అధ్యక్షతన దేవాలయ నిర్మాణంకోసం స్వస్తి శ్రీ విశ్వావ సు నామ సంవత్సరం దక్షిణాయనం కార్తీకమాసం శుక్ల పక్షం శుక్రవారం రోజున బ్రహ్మమూహుర్తంన వేదపండి తులు శ్రీ రామనందస్వామి ఆచార్యులు,(శ్రీ పాండురం గ గురుస్వామి)చే శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాపోలు మధుసూదన్ రెడ్డి తో పాటు గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాలనాయకులు భూమి పూజలో పాల్గొని ముగ్గు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భూమి పూజ సందర్భంగా హెూమం,అష్ట బంధనం, భు వరాహ వాహనము,, శంకుస్థాపన , ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో రాపోలు మధు సూదన్ రెడ్డి, చోక్కం రాములు, సానాది రాజు, మహే శ్వరం లక్ష్మణచారి,కుసుమ రమేష్,పండుగ శ్రీనివాసు, రాపోలు శివ చరణ్ రెడ్డి, చల్లా సంపత్ రెడ్డి, రొయ్యల కనుకయ్య, మారపాక ప్రభాకర్, రాజు, తాటికొండ రమేష్, కోరుకొప్పుల మధు,ఎడమ గట్ట య్య, ఎడమ అశోక్,ఎడమ నాగరాజు,మేకల రాజయ్య,చుక్కా రెడ్డి, నారాబోయిన వెంకటయ్య,యాదగరి,కుమార్,మాడూ రి వెంకటయ్య, అక్కెనపల్లి రామ్ నరసయ్య, ఈగ గట్టుమల్లు, మల్లేష్,రాగుల రాజేశ్వర్,రాజేష్,బలిజ హరీష్, దుంప మహేందర్, నాగరాజు,శివాలయం పూజారి ప్రతాపగిరి రవి,అర్చకులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ రిజర్వాయర్ గేట్ల ఎత్తివేతతో

# దేవునూరు రైతుల దుస్థితి

**వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు**



**హనుమకొండ బ్యూరో /అక్టోబర్ (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ ప్రధాన గేట్లు ఒక్కసారిగా ఎత్తివేయడంతో పరిసర గ్రామాల్లో తీవ్ర ప్రభావం కనిపించింది. భారీగా నీటి ప్రవాహం రావడంతో దేవునూరు ప్రధాన రహదారి పై ఉన్న బ్రిడ్జి దెబ్బతింది. ఫలితంగా గ్రామానికి వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దేవునూరు, పరిసర ప్రాంతాల్లోని వందల ఎకరాల వరి, పత్తి పంటలు నీటమునిగి రైతులు ఆవేదన చెందుతున్నారు. కష్టపడి సాగు చేసిన పంటలు కొద్ది గంటల్లోనే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయని రైతులు కన్నీటి గాధ చెబుతున్నారు. ప్రాజెక్ట్ అధికారులు ముందుగానే హెచ్చరికలు ఇవ్వకుండా ఒక్కసారిగా గేట్లు ఎత్తేయడంతో మా పంటలు మునిగిపోయాయి. కనీసం మాకు సమాచారం ఇచ్చి ఉంటే, పంటను రక్షించుకునే అవకాశం ఉండేది” అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఈ వ్యథను గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాన్ని మేల్కొల్పాలని, నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేవునూరు గ్రామ రైతులు ప్రత్యేకంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.“ప్రాజెక్ట్ అధికారులు నిర్లక్ష్యం చూపకపోయి ఉంటే ఈ స్థాయిలో పంట నష్టం జరగేది కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి” అని గ్రామ పెద్దలు



ఆగ్రహం వ్యక్తం చేశారు.మా దేవునూరు గ్రామ బ్రిడ్జిని బాగు చేయండి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించండి అంటూ గ్రామ రైతులు వేడుకుంటున్నారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం గ్రామానికి వచ్చి జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# తుఫాను కారణంగా నష్టపోయిన పంటల కొనుగోలు

**పంటలు దెబ్బతిన్న రైతులకు సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు**

-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి /అక్టోబర్31 (జర్నలిస్ట్ వార్త):** తుఫాను కారణంగా నష్టపోయిన పంటల కొనుగోలు, పంటలు దెబ్బతిన్న రైతులకు సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం టేకుమట్ల మండలం కుందనపల్లిలో తుఫాను ప్రభావం వల్ల దెబ్బతిన్న పంట పొలాలు, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముకాముఖీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అసలు



అధైర్యపడవద్దని స్పష్టం చేశారు. తడిసిన దాన్యం పారాబాయిల్డ్ మిల్లులకు తరలిస్తామని సూచించారు.
దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవ నివేదికలను సమీకరించాలని ఆదేశించారు. ఆ నివేదికలను పరిహారం చెల్లింపుకురాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. కుందనపల్లిలో రైతుల సౌకర్యార్థం ఐకేపి తరఫున శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. తుఫాను వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో కుందనపల్లి వాగును పరిశీలించిన కలెక్టర్, వరద ఉధృతి తగ్గే వరకు ప్రజలు వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, వ్యవసాయ అధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## 15వ బెటాలియన్ లో ఘనంగా

# రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలు

**సత్తుపల్లి/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):** 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్(గంగారం) నందు సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అదనపు దళాధిపతి అంజయ్య సర్దార్ వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎ. అంజయ్య మాట్లాడుతూ ఉక్కు మనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లభాయి పటేల్ జీవిత చరిత్రను అతని యొక్క కటోర దీక్షను, దేశ సమగ్రతకు, జాతి ఇక్యతకు అతను చేసిన సేవలను కొనియాడరు. అటువంటి మహనీయుల ఆశయ సదనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంధర్భంగా అంజయ్య అదికారులు, సిబ్బంది చేత రాష్ట్రీయ ఏక్తా దివాస్ యొక్క ప్రతిజ్ఞను చేయించటం జరిగినది. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్. కమాండెంట్ శ్రీధర్ రాజా, రంగారెడ్డి గారు , ఆఫీసర్స్, కానిస్టేబుల్ ఆఫీసర్స్ పాల్గొనటం జరిగినది.





# కేటీపిపి ఏడీఈ కుటుంబానికి టీఎస్ జేయూ నేతల పరామర్శ



**భూపాలపల్లి /అక్టోబర్ 31 (జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి జిల్లా:కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏడీఈ,కేటిపిపి బ్రాంచ్ సెక్రటరీ మాకుల సంతోష్ తండ్రి మాకుల అశోక్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నేతలు శుక్రవారం హనుమకొండలోని వారి స్వగృహంలో పరామర్శించి,మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్.జే.యూ.రాష్ట్ర ఆర్గనైజినింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, జయశంకర్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్ తదితరులు ఉన్నారు.

# పిడిఎస్‌యూ ఖమ్మం జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయండి




**తల్లాడ/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):** సమా సమాజ స్థాపన కోసం, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) ఖమ్మం జిల్లా 23వ మహాసభలు నవంబర్ 4న సత్తుపల్లి పట్టణంలో నిర్వహించబడనున్నాయి.
ఈ మహాసభలను సామాజిక స్ఫూర్తితో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి శశి కిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక తల్లాడ మండలం లో పి డి ఎస్ యూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి శశి కిరణ్ మాట్లాడుతూ. 1960 దశకం చివరిలో దేశంలో, ప్రపంచవ్యాప్తంగా వెల్లువలా వచ్చిన సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాతంత్ర, జాతి విముక్తి ఉద్యమాల ప్రభావంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా పిడిఎస్‌యూ ఆవిర్భవించింది. జార్జ్ రెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కొలశంకర్, చేరాలు, రంగవల్లి, వరహాలు, రమణయ్య, సాంబయ్య వంటి విప్లవ విద్యార్థి వీరులు విద్యార్థుల హక్కుల కోసం, శాస్త్రీయ విద్యా స్థాపన కోసం, సమానత్వ సమాజం కోసం తమ ప్రాణాలను అర్పించారు" అని గుర్తుచేశారు."సామాజిక, ప్రజాతంత్ర, విప్లవోద్యమాలకు పురిటిగడ్డ అయిన చారిత్రాత్మక సత్తుపల్లి కేంద్రంలో ఖమ్మం జిల్లా మహాసభలు నిర్వహించడం గర్వకారణం. కావున ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు మహాసభల విజయవం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా .రాజీవ్ గాంధీ, రాయాజ్, రాంచరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**రాయపర్తి/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని అన్ని గ్రామాలలో ఏఐటీయూసీ 106 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మొరిపిరాల,కొండూరు గ్రామాలలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి,మండల అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 లేబర్ కోడులను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని అన్నారు.వివిధ రంగాలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం 26000 రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని అన్నారు.కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైలపాక సోమయ్య, రమేష్, చెడుపాక అంజయ్య,కుక్కల మహేందర్, బంధు యాదయ్య, రమేష్,ప్రభాకర్, శ్రీకాంత్ ర్,ప్రశాంత్,కదిరి రవీందర్, రామవరపు రంజిత్,పెండ్లి వెంకన్న, పెండ్లి రమేష్,మామిడి శ్రీనివాస్, రవి,వెంకటయ్య,రామచంద్రు, సురేష్ యాదవ్,ఎల్లయ్య, రాకేష్, నరేష్,కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో పై విచారణ చేపట్టిన డిపీఓ



**రాయపర్తి/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త)** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఎంపీడీవో జి కిషన్ నాయక్ పై అదే కార్యాలయంలో టైపిస్ట్ గా పని చేస్తున్న స్వప్న తనను మానసికంగా వేధిస్తూ,తన నుండి అక్రమంగా డబ్బులు వసూల్ చేశారంటూ ఇటీవల జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసింది.జిల్లా కలెక్టర్ సత్య శారదా ఆదేశాల మేరకు విచారణ అధికారి జిల్లా పంచాయితీ అధికారి కల్పన శుక్రవారం కార్యాలయ సిబ్బందిని,పలువురు పంచాయితీ కార్యదర్శులను విడి విడిగా విచారించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచారణ నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించడం జరుగుతుందని అన్నారు.

# రక్త దాన శిభిరానికి మున్నెన్నాడు లేని విదంగా అనూహ్య స్పందన



**ఖమ్మంబ్యూరో /అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):**ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ పరిధి లో పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం సిపిసునీల్ దత్ పిలుపు తో, ఖమ్మం రూరల్ ఏసిపితిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నేలకొండపల్లి ఎస్సై సంతోష,పర్యవేక్షణ లో రోడ్డు ప్రమాద బాధితుల కోసం , తలసేమియా వ్యాధి బాధితుల కోసం , డెంగీ ఇతర అత్యవసర రక్త అవసరమైన వారి కోసం నేలకొండపల్లి లో జరిగిన రక్త దాన శిభిరం నిర్వహించగా మున్నెన్నాడు లేని విదంగా అనూహ్య స్పందన తో స్వచ్ఛందంగా వివిధ గ్రామాల నుండి వందలాది యువత రక్త దానం చేసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేసిన ప్రతి ఒక్కరికీ మరియు బాధితుల కోసం రక్త దాన శిభిరం నిర్వహించిన పోలీస్ ఉన్నంతధికారులకు నా తరపున మరియు టీమ్ తుమ్మల సోషల్ మీడియా తరపున ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

# వరంగల్-హనుమకొండలో చెరువుల నాళాలు కబ్జాలే ముంపు విపత్తులకు మూలం!

## హైదరాబాద్‌లో "హైడ్రా ఆపరేషన్"తో భూముల స్వాధీనం - వరంగల్‌కూ అదే కఠిన చర్యలు కావాలని ప్రజల డిమాండ్

### వరంగల్-హనుమకొండ సిటీకి కూడా "హైడ్రా" అవసరమా?


మొంథా తుఫాన్ ప్రభావంతో డ్రోన్ ద్వారా ఆహారం


మొంథా తుఫాన్ తో నీటిలో వరంగల్ ప్రాంతం

**హనుమకొండ బ్యూరో /అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్ మహానగరంలో చెరువులు, వాగులు, కుంటలపై అక్రమ నిర్మాణాలను కూల్చి "హైడ్రా ఆపరేషన్" పేరుతో ప్రభుత్వం వందల ఎకరాల ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.
మహానగరంలో భారీ వర్షాలు కురిసినా నీటి ముంపు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నందుకు ప్రజలు ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కానీ అదే పరిస్థితి వరంగల్%-%హనుమకొండ నగరాల్లో లేదు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, చెరువుల చుట్టుపక్కల భూములు కబ్జా కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**చెరువుల చుట్టూ భూముల కబ్జాలు %-% మూల కారణం**

స్థానిక ప్రజల ప్రకారం, పాత చెరువులకు కలిసే నాళాలు, కాల్వలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వ భూములు ఆక్రమించి ప్లాట్లు వేసుకోవడం వల్ల వర్షపు నీరు చెరువుల వరకు చేరకపోవడం ప్రధాన కారణమని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం చెరువులను రక్షించకపోతే ప్రతిసారి వర్షం కురిసినప్పుడు ఇలాంటి పరిస్థితి తప్పదని" నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హైడ్రా" ఆపరేషన్ వరంగల్‌కూ కావాలి**

హైదరాబాద్‌లో చేపట్టిన విధంగా వరంగల్%-%హనుమకొండలోనూ ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
చెరువులకు కలిసే కాల్వలు, నాళాలు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ముంపు


సీనియర్ జర్నలిస్ట్ కొట్టు సుధాకర్

సమస్యల నుంచి నగరం బయటపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

**వరంగల్%-%హనుమకొండ సిటీకి "హైడ్రా" అవసరమా?**

నగరవాసుల అభిప్రాయం ప్రకారం, నగర విస్తరణ పేరుతో చెరువుల పరిధిలో భూములను ఆక్రమించడం, నీటి ప్రవాహ మార్గాలను మూసివేయడం వలన ప్రతి వర్షాకాలంలో ముంపు విపత్తులు పెరుగుతున్నాయి.
హైదరాబాద్‌లోని "హైడ్రా ఆపరేషన్" మాదిరిగా ఇక్కడ కూడా కఠిన చర్యలు తీసుకుంటేనే నగరం శాశ్వతంగా నీటి ముంపు సమస్యల నుంచి బయటపడుతుందని ప్రజలు అంటున్నారు."వరంగల్, హనుమకొండలు ఇప్పుడు అభివృద్ధి దిశగా వేగంగా దూసుకెళ్తున్న నగరాలు. కానీ చెరువులు, నాళాలు కబ్జాలో ఉంటే ఈ అభివృద్ధి బురదలో కలిసిపోతుంది" అని నగరవాసులు తీవ్రంగా వ్యాఖ్యానిస్తున్నారు.

**ముఖ్యమంత్రికి విజ్ఞప్తి**

ఇటీవలి భారీ వర్షాల అనంతరం వరంగల్ ముంపు పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన విషయం తెలిసిందే.
"ముఖ్యమంత్రి గారు పరిశీలన తరువాత వెంటనే చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటేనే ప్రజలు విశ్వాసం పెంచుకుంటారు" అని నగరవాసులు తెలిపారు.
నగరవాసుల హెచ్చరిక
కాల్వలు, చెరువులు పునరుద్ధరించకపోతే రాబోయే వర్షాకాలంలో పరిస్థితి మరింత ఘోరంగా మారుతుంది," అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.
ప్రభుత్వం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం కోసం చెరువుల మూల ఆకృతిని తిరిగి పొందే ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
నిపుణుల అభిప్రాయంచెరువులు నగర ఊపిరితిత్తులు. వాటిని రక్షించడం ప్రభుత్వ బాధ్యత. నీటి ప్రవాహ మార్గాలను శాశ్వతంగా పునరుద్ధరించకపోతే నగర ముంపు తప్పదు," అని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.హైదరాబాద్‌లో హైడ్రా ఆపరేషన్ విజయవంతమైందంటే, వరంగల్‌లో కూడా అదే కఠినత అవసరం ఉంది. చెరువులు రక్షిస్తేనే ప్రజలు వర్షాల భయం లేకుండా జీవించగలరు."
వరంగల్%-%హనుమకొండ ప్రాంతాలు రాష్ట్రంలో రెండవ అతిపెద్ద నగరాలు.
ప్రభుత్వం సమయానికి చెరువుల పునరుద్ధరణ చర్యలు చేపడితేనే భవిష్యత్తులో ముంపు విపత్తులు తప్పించుకోవచ్చు.

# మానవత్వం చాటుకున్న ఏఎంసి చైర్మన్ తిరుపతిరెడ్డి

## -ఎంబిబిఎస్ సాధించిన పేద విద్యార్థికి రూ.50 వేలు అందజేత.

**తొర్రూరు/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద దళిత విద్యార్థికి అండగా నిలిచి తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి మానవత్వం చాటుకున్నారు.మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ధర్మారపు యాకయ్య-మహబూభా కుమారుడు ధర్మారపు లోకేష్ నీట్ పరీక్షలో ర్యాంకు సాధించి మంచిర్యాల మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు. సీటు సాధించిన పేద విద్యార్థి లోకేష్ ఎంబిబిఎస్ చదువుకు 5 సంవత్సరాల పాటు అయ్యే ఖర్చులను అందజేస్తున్నట్లు తెలిపారు.శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో మొదటి సంవత్సరం చదువు కోసం రూ.50 వేల రూపాయలను విద్యార్థి లోకేష్ ఆయన తండ్రి యాకయ్యకు అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబానికి చెందిన లోకేష్ ఎంబిబిఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు.5 సంవత్సరాలు పాటు ఎంబిబిఎస్ చదువు కోసం రూ.2 లక్షల 50 వేల



రూపాయలను అనుమాండ్ల మాధవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరఫున అందజేయనున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి,మెరుగు మల్లేశం గౌడ్,చర్లపాలెం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎక్కటి నాగిరెడ్డి,ఉపాధ్యక్షులు గజ్జి దర్గయ్య, నాయకులు ధర్మారపు మహేందర్,అనుమాండ్ల యాకుబ్ రెడ్డి, చిట్టిమల్ల మహేష్, జీనుగా రవీందర్ రెడ్డి,ఎద్దు మహేష్ యాదవ్ ,డాక్టర్ నాగయ్య, టి యాకయ్య, మహేందర్ రెడ్డి, గోపి, మహేష్, బుచ్చిరెడ్డి, మురళీధర్ రెడ్డి, గజ్జి మల్లయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎకరాకు 50వేల పరిహారం ఇవ్వాలి

## వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## -కల్వల మత్తడిని పరిశీలించిన కవిత



కరీంనగర్**అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో భారీ వర్షాలకు పంటనష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు కాకుండా.. ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో కొట్టుకుపోయిన కల్వల మత్తడిని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కల్వల మత్తడి కొట్టుకుపోయి 3 ఏళ్ళు అవుతోందని.. దీని రిపేర్ కోసం గత ప్రభుత్వమే రూ. 70 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని, కానీ తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు జరగటం లేదన్నారు. ఈ మత్తడిని రిపేర్ చేయించాలని హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్ట్‌పై వందలాది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన రూ. 70 కోట్ల జీవో ను పాస్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా రైతుల బాగు కోసం మత్తడి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదు అనే మాటను నిజం చేయాలంటే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో కట్ట తెగినప్పుడు అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించి తొందరగా దీన్ని పూర్తి చేశారని.. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా మత్తడిని పునరుద్ధరించాలని కోరారు. మొంథా తుపాను కారణంగా తెలంగాణ మొత్తం రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

# జర్నలిస్టును పరోక్షంగా భయపెట్టాలని చూస్తే సహించేది లేదు..

**మధిర ప్రెస్ క్లబ్ ఖండన**





**మధుర/అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):** వివరణ పేరుతో అక్రమ కేసులు బనాయిస్తే రాజ్యాంగంలో ఆర్టికల్ 19 (1) ఏ ప్రకారం జర్నలిస్టుల హక్కుల రక్షణ కై పోరాటంజర్నలిస్టులు ప్రజల పక్షాన ఉండి వార్తలు రాసే వారే... ఎవరిపైన వ్యక్తిగత ఉద్దేశంతో జర్నలిస్టులు వార్తలు రాయరు. ప్రజా సమస్యలను వెలికి తీస్తే అక్రమ కేసులు పెడతారా ప్రజా సమస్యలను పట్టించుకోని కొందరి అధికారులపై వార్తలు రాస్తే కలానికి సంకెళ్లు వేస్తారా..?

**ఇది ఎక్కడ ప్రజాస్వామ్యం..!**

మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రజల పక్షాన పనిచేస్తున్న జర్నలిస్టులను పరోక్షంగా భయపెట్టాలని చూస్తే సహించేది లేదని మధిర ప్రెస్ క్లబ్ ప్రెస్ నోట్ ద్వారా ఖండించారు. జర్నలిస్టులు ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి తీసుకుపోయి ఆ సమస్య పరిష్కారం కోసం రూపాయి జీతం ఆశించకుండా ప్రజల కోసం పనిచేస్తుంటే అలాంటి జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తామని వివరణ పేరుతో తప్పుడు కేసులు పెట్టేందుకు కొందరు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని మధిర ప్రెస్ క్లబ్ ఖండిస్తుంది. ఎవరైనా తప్పుడు వార్తల రాస్తే వారిని పిలిపించి మాట్లాడి ఎందుకు ఆ వార్త రాయాల్సి వచ్చిందో మీరు కూడా వివరణ తీసుకొని కేసు పెట్టండి అంతేతప్ప ప్రజా సమస్యలు విస్మరించి బాధ్యత రాహిత్యంగా వ్యవహరించే ఉద్యోగులపై.. కాంట్రాక్టర్లపై... వ్యవస్థలు.. సంస్థలపై వార్తలు రాస్తే కేసులు పెడతామని భయపెడితే నికార్సైన జర్నలిస్టులు ఎవరు భయపడరని ఈ సందర్భంగా తెలియజేశారు. అసలు ఎవరు విలేకరు..?ఎవరు ఏ వార్త ఫార్వర్డ్ చేస్తున్నారు ఎవరు వెనక ఎవరు ఉండి తప్పుడు ప్రచారాలు అసత్యపు మాటలు చెబుతూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారో ప్రజలకు తెలుసు. నిజంగా కావాలనే ఎవరైనా తప్పుడు వార్తలు రాసిన ఫార్వార్డ్ చేసిన అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి దానికి ప్రెస్ క్లబ్ గా మేము సహకరిస్తాం. కానీ కొందరు రాజకీయ నాయకులు మాటలు విని లేకుంటే వేరే వ్యక్తులు మాటలు విని జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి కలానికి సంకెళ్లు వేయాలని చూస్తే సహించేది లేదని తెలియజేస్తున్నాం.. జర్నలిస్ట్ విలువలకు వార్తలు రాసే విధానానికి తేడా ఉంటుందని ప్రజా సమస్యలే జర్నలిస్టుల ఏకైక ఎజెండా అంతేతప్ప ఎవరి పైన వ్యక్తిగత ద్వేషంగాని, ఉద్దేశం గానీ ఉండదని దయచేసి అధికారులు ఆలోచనతో నిర్ణయాలు తీసుకోవాలని వాస్తవాలను గ్రహించాలని నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులను అధికారం పేరుతో భయపెట్టాలని చూస్తే సహించేదే లేదన్నారు. అదే విధంగా రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1) (ఏ)ప్రకారం జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కమిటీ గుర్తు చేసింది. మధిరలో జర్నలిస్టులపై జరిగే అసత్య పరిణామాలపై రాజకీయ పార్టీలు కూడా ఆలోచించాలని జర్నలిస్టులు ప్రజల కోసం ప్రజా సమస్యలపైనే వార్తలు రాస్తారే తప్ప వారి వ్యక్తిగత ప్రయోజనం ఏమీ ఉండదని ఆ దిశగా మధిర సమాజం కూడా ఆలోచన చేయాలని మధిర ప్రెస్ క్లబ్ గా విజ్ఞప్తి చేశారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ఖమ్మంబ్యూరో/అక్టోబర్ 31(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం వాస్తవ్యులు, సీనియర్ జర్నలిస్ట్ ఆకుతోట ఆదినారాయణ – అరుణకుమారి దంపతుల జ్యేష్ఠ కుమారుడు అన్వేష్ హైదరాబాద్ మియాపూర్ వాస్తవ్యులు ఎద్దుల సునీల్ కుమార్ రెడ్డి – భారతీరెడ్డి దంపతుల కుమార్తె విధితల నిశ్చితార్థ వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. మియాపూర్ శుభమ్ సెలబ్రేషన్స్ హాలులో ఏర్పాటు చేసిన ఈ వేడకకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కుటుంబ సమేతంగా హాజరై అక్షింతలు వేసి కాబోయే వధూవరులు అన్వేష్ –విధితలకు తమ ఆశీస్సులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు.

## జాతీయ ఐక్యతా దినోత్సవం పురస్కరించుకొని సత్తుపల్లి లో రన్ ఫర్ యూనిటీ...



**సత్తుపల్లి/అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):**ఖమ్మం జిల్లాసత్తుపల్లి పట్టణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా, జాతీయ ఐక్యత దినోత్సవంను పురస్కరించుకుని నేషనల్ యూనిట్ డే లో భాగంగా కల్లూరు ఏ సి పి రఘు ఆధ్వర్యంలో పోలీసులు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి అదనపు ఆరవ జడ్జి శ్రీనివాస్ జండా ఊపి ప్రారంభించారు.జే.వి.ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభమైన కార్యక్రమం పట్టణంలోని రింగ్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్ ఫర్ యూనిటీ ద్వారా ఐక్యత, సోదర భావం, దేశభక్తి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఖమ్మం జిల్లాలో సీపీఎం నేత దారుణ హత్య







**చింతకాని/అక్టోబర్31 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లాలో సీపీఎం నేత హత్య దారుణం చోటుచేసుకుంది. చింతకాని మండలం పాతర్లపాడులో సీపీఎం రైతు సంఘం నేత సామినేని రామారావు శుక్రవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యారు. వాకింగ్‌కు వెళ్లిన ఆయనను దుండగులు గొంతుకోసి చంపేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాలపై విచారణ చేపట్టారు. పాతర్లపాడు గ్రామంమాజీ సర్పంచ్ సిపిఎం నాయకులు రామారావు ని పాశవికంగా హత్య చేయటాన్ని టీడీపీ తీవ్రంగా ఖండిస్తున్నది ప్రజాస్వామ్యంలో హత్యారాజకీయాలకు తావులేదని నేరస్తులను కఠినంగా శిక్షించాలని టీడీపీ కోరుతున్నది.డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ కన్వీనర్సిపియం సీనియర్ నాయకులు కామ్రేడ్ సామినేని రామారావు హత్య గురించి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ,సిపిఎం నేత హత్య సంఘటనతో సొమ్మసిల్లిపోయిన భార్య కుటుంబ సభ్యులు.

సిపిఎం మాజీ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు సీనియర్ నాయకులు కామ్రేడ్ సామినేని రామారావు హత్య చేసిన సంఘటన తెలిసిన ఆయన భార్య సామినేని స్వరాజ్యం సొమ్మసిల్లిపోయారు.

రామారావుకి ఇద్దరు పిల్లలు విజయ్ కుమార్ , లలిత..చింతకాని మండలం, పాతర్లపాడు గ్రామంలో సీనియర్ నేత సామినేని రామారావు రాజకీయ హత్యకు గురికావడంపై డిప్యూటీ సీఎం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.కలుషిత హింసా రాజకీయాలకు తావు లేదని డిప్యూటీ సీఎం అన్నారు.శాంతి భద్రతలపై ఖమ్మం పోలీస్ అధికారులను సీరియస్‌గా హెచ్చరించిన డిప్యూటీ సీఎం, క్లూస్ టీం, స్నిఫర్ డాగ్స్, సైబర్ టీం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అన్ని మార్గాలను ఉపయోగించి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు.

సీనియర్ నేత సామినేని రామారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి మరియు సంతాపాన్ని తెలియజేశారు.రామారావు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, పూర్తిస్థాయిలో ఆదుకుంటానని భరోసా ఇచ్చారు డిప్యూటీ సీఎం
లిసంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ కమిషనర్.

సామినేని రామారావు హత్యకు గురైన సంఘటన స్థలానికి జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేరుకున్నారు. క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ బృందాలతో పాటు ప్రత్యేక టీం తో విచారణ నిర్వహిస్తున్నారు.
ప్రత్యేక టీం లను ఏర్పాటుచేసి నిందితులను పట్టుకుంటామని సిపి వెల్లడించారు.



## సభ్య సమాజం తలదించుకునేలా...!

**మరో కొడుకుతో సంసారం కోసం కోడలిపై ఒత్తిడి**

**ఇంట్లోనే నిర్బంధించి చిత్రహింసలు**

**పోలీసుల రంగప్రవేశంతో గుట్టు బట్టబయలు**

ఏలూరు**అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):**
సభ్యసమాజం తలదించుకునేలా చేసిందో కుటుంబం. భార్యా, భర్తల బంధానికి విలువ లేదా అని అనిపించేలా వ్యవహరించింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఓ మహిళను అత్తంటి వాళ్లు వేధించిన తీరు తెలిస్తే మాత్రం షాక్ అవ్వాల్సిందే. జంగారెడ్డిగూడెంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. భర్త సోదరుడిని సుఖ పెట్టాలని వివాహితను అత్తామామలు, తోడికోడలు వేధింపులకు గురిచేసారు. రెండేళ్ల క్రితం రంజిత్ కుమార్ అనే వ్యక్తితో మహిళకు వివాహం జరిగింది. వీరికి ఏడాది కొడుకు ఉన్నాడు. అయితే గత కొన్ని రోజులు ఓ విషయంపై అత్తమామలతో పాటు తోటి కోడలు కూడా మహిళను చిత్రహింసలు పెడుతున్నారు. భర్త సోదరిడితో మరొక వారసుడికి జన్మనివ్వాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి. అయితే ఇందుకు వివాహిత ఒప్పుకోలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అత్తింటి వాళ్లు.. వివాహితను దాదాపు 10 రోజులు గదిలో నిర్బంధించారు. మహిళతో పాటు ఏడాది కొడుకును కూడా గదిలో బంధించారు. బంధించిన గదికి కరెంట్ , బాత్రూమ్, త్రాగు నీరు , తిండి లేకుండా అత్తంటి వారు అతి దారుణంగా ప్రవర్తించారు. మహిళకు జరుగుతున్న అన్యాయంపై హ్యూమన్ రైట్స్ స్టేట్ వైస్ చైర్ పర్సన్ మండెం లక్ష్మి, సభ్యులకు సమాచారం అందింది. బాధితురాలికి మద్దతు తెలుపుతూ ఇంటి ముందు మహిళా సంఘాలు టెంట్ వేసి నిరసనకు దిగాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కుటుంబసభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం



**అక్టోబర్31(జర్నలిస్ట్ వార్త):**
'మొంథా' తుపాను కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం హన్మకొండ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై సమగ్ర నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్ద ఉన్న సమాచారాన్ని కూడా




కలెక్టర్లకు అందజేయాలని సూచించారు.
అన్ని నివేదికలను క్రోడీకరించి నిర్దిష్ట నమూనాలో కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని ఆయన అన్నారు. తుపాను నష్టాల నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి కృషి చేయాలని, ఈ విషయంలో అధికారులు అలసత్వం వహించకూడదని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. తెలంగాణ ధనిక రాష్ట్రమైనప్పటికీ, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వదులుకునే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.



వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం అందజేస్తుందని ప్రకటిచారు. ఇళ్లు నీట మునిగిన బాధితులకు రూ. 15 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గుడిసెలు కోల్పోయిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద గృహాలు మంజూరు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎకరా పంట నష్టానికి రూ. 10 వేలు, ఆవులు, గేదెలు మరణిస్తే రూ. 50 వేలు, మేకలు, గొర్రెలు మరణిస్తే



రూ. 5 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

